# అకాల వర్షం.. అపార నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు



భీమారం మండల కేంద్రంలో ఓ ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

మేడిపల్లి/సారంగపూర్, మే 22: జిల్లాలోని పలు మండలాల్లో గురువారం అకాల వర్షం పడింది. ఈ క్రమంలో పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. మేడిపల్లి, భీమారం మండలాల్లోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. భీమారం మండలం ఎస్సీ కాలనీకి చెందిన జూపాక చిన్న నర్సయ్య, సుంకరి లక్ష్మి, బీటుకు రాజు, కాయితి వెంకటనర్సు, ఒరగంటి శేఖర్, ఒరగంటి రాజేందర్ ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. డ్రేనేజీ ఉన్నచోట శుభ్రం చేసి, లేనిచోట కొత్తగా నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో అకాల వర్షాలతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రంగసాగర్‌లో 850, కండ్లపల్లిలో 880, కందెనకుంటలో 750, మోతినగర్‌లో 1050, చర్లపల్లిలో 400, తుంగూర్‌లో 850 కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో సహకార సంఘ అధికారులు మిల్లు అలాట్‌మెంట్‌కు పంపించినట్లు తెలిపారు. గురువారం పలు గ్రామాల్లోని సెంటర్లలో ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఇబ్బందిపడ్డారు.

### తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

సారంగాపూర్, మే 22: అకాల వర్షాలకు తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ డిమాండ్ చేశారు. గురువారం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి, కందెనకుంట, బీర్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో తడిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలన్నారు. అలాగే సారంగాపూర్ మండలంలోని ఆయా కేంద్రాల్లో తడిసిన ధాన్యం వెంటనే కొనాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తేలు రాజు, మండల ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి కోరారు.



బీర్‌పూర్ మండలం కందెనకుంటలో ధాన్యం సెంటర్‌లో తడిసిన ధాన్యం

## బోధన నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి

కోరుట్ల, మే 22: ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని కోరుట్ల ఎంఈవో గంగుల నరేశం పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ఆన్ కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్' కార్యక్రమంలో భాగంగా మూడోరోజు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులపై డిజిటల్ మోడ్‌లో ఐఎఫ్‌పీ ప్యానెల్ బోర్డు ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఇక్కడ రిసోర్స్ పర్సన్లు అందె శివప్రసాద్, సిరిపురం శ్రీనివాస్, అంకం దామోదర్, గంగుల రణధీర్, అన్నం మహేశ్, మాసం చిరంజీవి, కోసరి శేఖర్, సీఆర్పీలు గంగాధర్, దేవేందర్, సత్యనారాయణ, మన్విత, జ్యోతి, తదితరులు ఉన్నారు.

## అవగాహన కల్పించాలి

జగిత్యాల టౌన్, మే 22: లింగ సమానత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ బీ ఎస్ లత పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో జరుగుతున్న ఐదు రోజుల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పాఠశాలలో గానీ.. ఇంటిలో గానీ బాలబాలికలను సమానంగా చూడాలని కోరారు. బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. ఇక్కడ డీఈవో కే రాము, అర్బన్ ఎంఈవో చంద్రకళ, రిసోర్స్‌పర్సన్స్ సీహెచ్ పీ శ్రీనివాస్‌నాయుడు, కృష్ణసాయి, రాజ్‌కుమార్, చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, జగదీశ్వర్, పీఆర్‌టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనంద్‌రావు ఉన్నారు.

## పిడుగుపాటుకు ఆలయ గోపురం ధ్వంసం

ఇబ్రహీంపట్నం, మే 22: గోదూర్‌లో శ్రీ స్వయంభూ వీరాంజనేయస్వామి ఆలయ గోపురం పిడుగుపాటుతో ధ్వంసమైందని గురువారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం రాత్రి ఉరుముల మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడి ఆలయ గోపురం ధ్వంసమైందన్నారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి చేరుకుని కూలిన భాగాన్ని పరిశీలించారు.



ధ్వంసమైన ఆలయ గోపురం

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★Dandem Sumalatha W/o Mysaiah (Old Name), H.No. 3-11, R/o Rajannapet, Yellareddypet Mandal, Rajanna Sircilla Dist. My Name is changing to Bathula Renuka W/o Mysaiah D/o Yellaiah (New Name)
NTK-330317

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కోరుట్ల: లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి టౌన్, మే 22: కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆరోపించారు. గురువారం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 36మందికి ₹8.69 లక్షలు, పట్టణానికి చెందిన 28మందికి ₹5.85లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేసి, మాట్లాడారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ దవాఖాన శిథిలావస్థకు చేరుకోగా బీఆర్ఎస్ హయాంలో పనులు ప్రారంభించామని, ప్రస్తుతం నిధులు నిలిపివేయడంతో పనులు కొనసాగించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు వారి లబ్ధి కోసమే పనులు చేస్తున్నారని ఆరోపించారు. సామాన్య ప్రజలు, రైతులను ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. మద్యం ధరలతో పాటు జీలుగు, జనుము విత్తనాల ధరలను పెంచిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ అంగడి పురోషత్తం, నాయకుడు ఓజ్జెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### అందాల పోటీల మీద ఉన్న ప్రేమ రైతులపై లేదా?

ఇబ్రహీంపట్నం, మే 22: అందాల పోటీల మీద ఉన్న ప్రేమ ఈ ప్రభుత్వానికి రైతులపై లేదా? అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద పలు గ్రామాలకు చెందిన 28మంది లబ్ధిదారులకు ₹8.28లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తొలి సీఎం కేసీఆర్ ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందేలా అనేక పథకాలను ప్రవేశపెట్టి ఆదుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆరిగోస పెడుతున్నదని తెలిపారు. అకాల వర్షాలతో కేంద్రాల్లో వడ్లు తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తడిసిన ధాన్యం సైతం కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు నేమూరి సత్యనారాయణ, నేతలు జాజాల జగన్‌రావు, పుప్పాల నర్సయ్య, తిరుపతిరెడ్డి, తుక్కారాం, రెబ్బటి రాజేందర్, తోకల శేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ హయాంలోనే సంక్షేమ ఫలాలు

కోరుట్ల, మే 22: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సబ్బండవర్గాలకు సంక్షేమ ఫలాలు దక్కాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన 54మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి, మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో చేతులెత్తేసిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చీటి వెంకట్రావు, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, మాజీ ఎంపీపీ తోట నారాయణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### పాత్రికేయుల సంక్షేమానికి కృషి

మెట్‌పల్లి రూరల్, మే 22: పాత్రికేయుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మెట్‌పల్లి మండల పరిషత్‌లో గురువారం నిర్వహించిన 'మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్' నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకాగా, పాత్రికేయులు సన్మానించారు. అనంతరం వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ గౌరవాధ్యక్షుడు సౌడాల కమలాకర్, నూతన అధ్యక్షుడు నాంపల్లి నమ్లాద్రి, ప్రధాన కార్యదర్శి మెన్నేని వేణురావు, ఉపాధ్యక్షుడు అరిసె రాజేశ్, సంయుక్త కార్యదర్శి బిజ్జారపు నవీన్, కోశాధికారి ముదాం శ్రీనివాస్, కార్యనిర్వహణ సభ్యుడు అనుపురం సతీశ్, గౌరవ సలహాదారు షౌకత్‌అలీని ఎమ్మెల్యే సన్మానించారు. ఇక్కడ జర్నలిస్టు యూనియన్ సభ్యులు గుజ్జేటి శ్రీనివాస్, పాంపట్టి అనిల్, రాసమొల్ల చంద్రశేఖర్, వసీం, వెంకటరమణ, అరుణ్‌గౌడ్, ఆగ సురేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మల్లాపూర్, మే 22: మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక కార్యాలయంలో 45మంది లబ్ధిదారులకు రూ.12.56లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను గురువారం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పంపిణీ చేశారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి సరోజన, ఏఎంసీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్ ఉన్నారు.



జగిత్యాల: నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

## ఆదర్శం.. భాగ్యరెడ్డివర్మ

జగిత్యాల, మే 22: మ్యాదరి భాగ్యరెడ్డివర్మ పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమని కలెక్టర్ బీ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాగ్యరెడ్డి వర్మ దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందారని హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి రాజ్‌కుమార్, దళిత సంఘం నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల, మే 22: మున్సిపల్ కార్యాలయంలో గురువారం సంఘ సంస్కర్త, తెలంగాణ వైతాళికుడు భాగ్యరెడ్డివర్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్, డీఈఈ సురేశ్, ఆర్ఐ క్రాంతి ఉన్నారు.

## జిల్లా కేంద్రంలో భారీ వర్షం



పార్కు గల్లీలో నిలిచిన వర్షపు నీరు

జగిత్యాల, మే 22: జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం సుమారు గంటన్నర సేపు భారీ వర్షం పడగా, రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపై వాహనాలు నడపడానికి కూడా వీలు లేకుండా పోయింది. తహసీల్ చౌరస్తాలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పలు దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. పార్కుగల్లీలోని రోడ్డుపై వర్షపు నీరు అలాగే ఉండడంతో మోకాలు లోతు నీటిల్లోంచి వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

## డ్రగ్స్‌పై టీచర్లకు అవగాహన

జగిత్యాల టౌన్, మే 22: జిల్లా కేంద్రంలోని పురాతనమైన ఉన్నత పాఠశాలలో జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రకాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై వివరించారు. ఇక్కడ జగిత్యాల ఎక్సైజ్ సీఐ వై సర్వేశ్వర్, టాస్క్‌ఫోర్స్ సీఐ సీహెచ్ రాజమౌళి, ఎస్ఐ రాజేందర్ ఉన్నారు.

## శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఖాళీ చేయాలి

కోరుట్ల, మే 22: శిథిలావస్థ, పురాతన ఇండ్లు, భవనాల్లో ఉంటున్నవారు అకాల వర్షాల నేపథ్యంలో వెంటనే ఖాళీ చేయాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లకు మరమ్మతులు చేపట్టడం వీలుకాని పక్షంలో ఖాళీ చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మేరకు పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న ఇండ్ల యజమానులకు నోటీస్‌లు అందించినట్లు తెలిపారు.

## చినుకు పడితే చిత్తడే!



కోరుట్ల తహసీల్ కార్యాలయం ఎదురుగా నిలిచిన వర్షపు నీరు

కోరుట్ల, మే22: పట్టణంలో చిన్నపాటి వర్షానికే రహదారులు జలమయం అవుతున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి ఆదర్శనగర్, పద్మపురి వాడ, ముత్యాల వాడ, ప్రకాశంరోడ్డు, రథాలపంపు ప్రాంతాల్లో రహదారులపై వరద నీరు నిలిచి చిత్తడిగా మారింది. స్థానిక తహసీల్, ఆర్టీఏ కార్యాలయాల ఎదురుగా ఉన్న మట్టి రోడ్డుపై నీరు నిలిచి బురదమయమైంది. దీంతో కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే పాదాచారులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఎగువప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు కాలనీలకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సుప్రీంకోర్టు సాక్షిగా.. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి చెంపచెట్టు

జగిత్యాల, మే22: పాలమూరు ప్రాజెక్టులో అవినీతి లేదని, సీబీఐ దర్యాప్తు అవసరం లేదని, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ, జస్టిస్ నాగరత్న బెంచ్ స్పష్టీకరణ చేశారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీటి ప్రాజెక్టులు ప్రజా ప్రయోజనాల కోసం చేపడుతారని, ప్రాజెక్టులతో తెలంగాణ ఎంతో అభి వృద్ధి చెందిందన్నారు. ప్రాజెక్టు వచ్చిన తర్వాత వరి సాగులో 18 లక్షల ఎకరాలతో దేశంలో నంబర్‌వన్ స్థానంలో తెలంగాణ నిలిచిం దన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని తేటతెల మైందన్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, కమిషన్లను ఏర్పాటు చేసి కక్ష గట్టి తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, హరీశ్‌రావులపై సమన్లు జారీ చేయడం సరికాదన్నారు.

## అభ్యసనా సామర్థ్యాలు పెంచడానికి కృషి చేయాలి



శిక్షణ తరగతులను పరిశీలించి మాట్లాడుతున్న డీఈవో రాము

సారంగాపూర్, మే 22: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంచడానికి ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని డీఈవో రాము సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల ఎస్జీటీ, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు ఐదు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా, గురువారం డీఈవో సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో కిశోర్, రిసోర్స్‌పర్సన్లు ఉమేశ్, నరేశ్, రాజేంద్రప్రసాద్, రవీందర్, మునీందర్, శారద, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

మల్లాపూర్, మే 22: మండల కేంద్రంలోని దుర్గమ్మ కాలనీలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.12లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను గురువారం మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల గెలిచిన వెంటనే కాలనీలో మార్నింగ్ వాక్ చేసి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. దీంతో కాలనీవాసులకు ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బండి లింగస్వామిగౌడ్, నాయకులు కొమ్ముల జీవన్‌రెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మణ్, కొడూరి భిక్షపతి, నల్ల రాజేశ్వర్, బదినపల్లి ప్రేమ్, డబ్బ రమేశ్‌రెడ్డి, కొంపల్లి రాజు, నల్ల లక్పతి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

కొడిమ్యాల, మే 22: శ్రీరాములపల్లిలో గురువారం వ్యవసాయశాఖ అధికారులు రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జగిత్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంతీయ శాస్త్రవేత్త ఏడీఆర్ శ్రీలత మాట్లాడుతూ, రైతులు సాగునీటి యాజమాన్యం, పంటల మార్పిడి చేయాలన్నారు. చెట్లను పెంచడంతోపాటు పర్యావరణాన్ని కాపాడాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. ఇక్కడ మదన్‌మోహన్‌రెడ్డి, ఏవో జ్యోతి, వేణు, రాజేశ్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఉన్నారు.

## అభివృద్ధిపై దృష్టిసారించాలి

సారంగాపూర్, మే 22: గ్రామాల అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్‌లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, కార్యదర్శులు సమయ పాలన పాటిస్తు గ్రామాల్లో పారిశుద్య పనులు చేయించాలన్నారు. ఈజీఎస్ పనుల నిర్వహణ, వ్యక్తిగత ఇంకుడుగుంతల ఏర్పాటు, నర్సరీల్లో మొక్కల సంరక్షణ, రాజీవ్ యువ వికాసం, గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చించి పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎంపీవో సలీం, ఏపీవో శ్రీలత, టీఏలు ఉన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ధర్మపురి, మే 22: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 54మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లికి కల్యాణ లక్ష్మి ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ సుమన్, నాయకులు సంగనబట్ల దినేశ్, చిలుముల లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్ శ్రీ ఆంజనేయ స్వామివారు





అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

# జై బోలో హన్మాన్‌కీ..

- కాషాయమయమైన కొండగట్టు
- వైభవంగా హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు



క్యూలైన్లలో కిక్కిరిసిన అంజన్న భక్తులు

మల్యాల, మే 22: రామలక్ష్మణ జానకీ.. జై బోలో హన్మాన్‌కీ.. శ్రీ రామ జయ రామ, జయజయ రామ.. అంటూ రామనామ సంకీర్తనలతో కొండగట్టు మార్మోగిపోయింది. పచ్చని వృక్ష సంపదతో అలరారే కొండగట్టు ఉప్పెనలా వచ్చిన అంజన్న దీక్షాపరులతో కాషాయవర్ణ శోభితమైంది. హనుమాన్ పెద్ద జయంతిని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. హనుమజ్జయంతికి భద్రాచలం శ్రీ సీతారామ స్వామి దేవస్థానం వారు అధికారికంగా కొండగట్టుకు అందచేసిన పట్టు వస్త్రాలతో స్వామి వారి మూలవిరాట్టును అలంకరించారు. వివిధ పూజల అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై ఆలయ వీధుల గుండా ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా తరలివచ్చిన దీక్షాపరులు వెల్లువలా ఆలయానికి తరలివచ్చారు. స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి, చొప్పదండి ఎమ్మెల్యేలు సీహెచ్ విజయరమణా రావు, మేడిపల్లి సత్యం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జెఎన్‌టీయూ నుంచి బొజ్జపోతన వరకు ఏర్పాటు చేసిన మూడు వాహన పార్కింగ్ స్థలాలు, గుట్ట కింద గల వాహన పార్కింగ్ స్థలం భక్తుల వాహనాలతో పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పర్యవేక్షకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ధర్మపురి, మే 22: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోరుట్ల, మే 22: పట్టణంలోని స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు చీటి వెంకట్రావు, దారిశెట్టి రాజేశ్, సురేందర్, రవీందర్, రాజేందర్, గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

## దేశభక్తిని పెంపొందించండి

జగిత్యాల, మే 22: విద్యార్థుల్లో దేశభక్తితోపాటు మన సంస్కృతి సంప్రదాయాలను నేర్పించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ సూచించారు. స్థానిక ఓల్డ్ హైస్కూల్ జగిత్యాలలో జరుగుతున్న ఐదురోజుల ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని కోరారు. సిలబస్‌లో వస్తున్న మార్పుల వల్ల ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్డేట్‌కావాలని కోరారు. ఇక్కడ డీఈవో రాము, జగిత్యాల అర్బన్ ఎంఈవో చంద్రకళ, రిసోర్స్‌పర్సన్స్ సీహెచ్ పీ శ్రీనివాస్, కృష్ణసాయి, రాజకుమార్, చంద్రశేఖర్, జగదీశ్వర్, దేవేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనందరావు పాల్గొన్నారు.

*అభివృద్ధి పనులను పూర్తి చేయాలి*

జగిత్యాల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో మున్సిపల్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డుల్లో అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. వివిధ కారణాలతో ఆగిపోయిన అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్, పబ్లిక్ హెల్త్ డీఈ వరుణ్, ఏఈలు శరణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

## ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జగిత్యాల టౌన్, మే 22: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ బీ నారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఫస్టియర్ జనరల్ విభాగంలో 1,562 మందికి గానూ 1,470 మంది హాజరు కాగా 92మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ఒకేషనల్‌లో 246మందికి గానూ 231మంది హాజరు కాగా 15మంది గైర్హాజరైనట్లు తెలిపారు. సెకండియర్ జనరల్‌లో 434మందికి గానూ 408 మంది హాజరుకాగా, 26మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఒకేషనల్‌లో 47మందికి గానూ 44మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

## రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి

పెగడపల్లి, మే 22: రెండు రోజుల్లో మండలంలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ పేర్కొన్నారు. గురువారం నంచర్ల, దేవికొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఇక్కడ నాయకులు గోగూరి సతీశ్‌రెడ్డి, ఎడ్ల రాజయ్య, లైశెట్టి తిరుపతి, శ్రీనివాస్, మధుకర్ తదితరులు ఉన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

మల్లాపూర్, మే 22: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కటింగ్‌లు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ మండలాధ్యక్షుడు కల్లెం మహిపాల్‌రెడ్డి, నాయకులు పోచంపల్లి రాజేందర్, దారిశెట్టి చిన్నారెడ్డి, మినుగు కొండయ్య, నరేశ్, రాజం, రాజేందర్, రైతులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల సాయం

మల్లాపూర్, మే 22: గొర్రెపల్లి గ్రామానికి చెందిన మాదం నాగరాజ్ ఇటీవల విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థులు (2006–07లో ఎస్సెస్సీ బ్యాచ్) చేయూతనందించారు. గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.47వేల నగదును మల్లాపూర్‌లోని కేడీసీసీబీ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను నాగరజ్ కూతుళ్లకు అందించారు. ఇక్కడ పూర్వ విద్యార్థులు ముత్యాల రమేశ్, పడాల రాజశేఖర్, చెదలు హరీష్, జిట్టవేని నర్సయ్య, కనుక రాజశేఖర్, కట్ట వీరేంద్రచారి, దేవ రమేశ్, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

మల్లాపూర్, మే 22: మండల కేంద్రంతోపాటు ముత్యంపేట, సాతారం, వేంపల్లి, గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయశాఖ ఏడీఏ రమేశ్ తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రతి దుకాణం ఆవరణలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఇక్కడ ఏవో లావణ్య, సిబ్బంది ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మేడిపల్లి, మే 22: భీమారం మండలం వెంకట్రావుపేటకు చెందిన ఉత్కం సుశీలకు మంజూరైన రూ.36వేల విలువైన సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి అజయ్, ఎండీ సయ్యద్, భూరం అరుణ్, అడ్లగట్ట ప్రేమ్, ఉత్కం అజయ్, ముదిగొండ మహేశ్, ఎండీ ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.